క్లుప్తంగా

23న నీటి సరఫరాకు అంతరాయం

కాకినాడ: తాగునీటి పైపులైన్ల మరమ్మతుల నేపథ్యంలో ఈ నెల 23న నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని నగరపాలక సంస్థ వాటర్ వర్క్స్ ఈఈ ప్రభాకర్ అన్నారు. మెయిన్‌రోడ్డు, సూర్యారావుపేట, రామకృష్ణారావుపేట, దేవాలయం వీధి, అచ్యుతరామయ్యవీధి, మహాలక్ష్మినగర్, ముత్తానగర్, గోళీలపేట పరిసర ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు. అత్యవసరమైతే ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తామని, 0686770461, 97484 71415, 63013 87834 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని అన్నారు.

కష్టపడి చదివితే ఫలితాలు

కరప: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతుండడంతో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని యూటీఎఫ్ మండల శాఖ గౌరవాధ్యక్షుడు వడ్డి వెంకటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు గంగ సూరిబాబు అన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణ మూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ, యూటీఎఫ్ నాయకులు సంయుక్తంగా 10వ తరగతి విద్యార్థులకు మోడల్ పరీక్షలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన విద్యార్థులు టి.షర్మిలాసత్య, ఇ.మానసలకు మెరిట్ సర్టిఫికెట్, మెమెంటోలు అందజేశారు. హెచ్ఎం యు.లీలామనోహర్, మండల యూటీఎఫ్ అధ్యక్షుడు తలాటం శ్రీరామ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రతినిధి సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

రాణికి ఉగాది పురస్కారం



రాణికి పురస్కారం అందిస్తున్న నారాయణమూర్తి

కాకినాడ రూరల్: వాకలపూడికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు, సామాజికవేత్త నల్లని బంధన రాణికి ఉగాది పురస్కారం లభించింది. రాజమహేంద్రవరం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది పురస్కారాల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య, ఆంధ్రప్రదేశ్ దృశ్యకళల అకాడమీలు, కేంద్ర ప్రభుత్వ సంగీత, నాటక అకాడమీల సహకారంతో రోటరీ క్లబ్ మాతృ భాషా సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణలో సేవలందించినందుకు నల్ల నిబంధన రాణికి సినీనటుడు ఆర్.నారాయణమూర్తి పురస్కారం అందించారు. పురస్కారం రావడంపై రాణి, శ్రీను దంపతులు హర్షం వ్యక్తం చేశారు.

పోషకాహార ఆవశ్యకత తెలపండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జాయింట్ కలెక్టర్ ఇలక్కియ

కాకినాడ సిటీ: జిల్లాలో ప్రతి కుటుంబానికి పోషకాహార ఆవశ్యకతను తెలపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారిత అధికారి కె.ప్రవీణతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని 20వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకూ నిర్వహిస్తామన్నారు. జిల్లాలో 21న స్థానిక టీవీ చానల్, రేడియోల్లో చర్చలు, పోషకాహార మేళాలు నిర్వహిస్తారన్నారు. గ్రామ స్థాయిల్లో 22న మిల్లెట్స్ ప్రచారం, 23న పోషకాహార నిపుణులతో చర్చ ఉంటుందన్నారు. 25న మిల్లెట్స్ ఆధారిత ఆహార పదార్థాలపై దృష్టి, 28 రన్, ఐఈసీ ప్రచారాలు జిల్లా, మండల స్థాయిలో ఉంటాయని ఐసీడీఎస్ పీడీ ప్రవీణ తెలిపారు.

వీధులు జలమయం

కరప: మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గ్రామాల్లోని వీధులు, లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. సోమవారం ఉదయం కురిసిన వానకు కరప, గొడ్డటిపాలెం, నడకుదురు, గురజనాపల్లి, వేములవాడ తదితర గ్రామాల్లో వర్షం నీరు పోయే మార్గం లేక వీధులన్నీ బురదమయంగా మారాయి. కరపలోని ఎంపీడీఓ, ఎంఈఓ కార్యాలయాల వద్ద నీటిలోంచే సిబ్బంది రాకపోకలు సాగించారు. ఈ వర్షాలతో కొంతమేర సాగునీటి ఎద్దడి నుంచి గట్టెక్కామని రైతులు వెలుగుబంట్ల రవినాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, పెంకే విష్ణు తెలిపారు. వానలతో రబీ పంటకు నష్టమేమీ లేదని ఎంఏఓ రాజేష్ తెలిపారు.

ఆక్రమించారని ఫిర్యాదు

కాకినాడ సిటీ: ఇంద్రపాలెం అభయాంజనేయ స్వామి వీధిలోని డ్రైనేజీని ఆక్రమించారంటూ సింగంశెట్టి శ్రీనివాస్, నాగమణి దంపతులు సోమవారం జేసీ ఇలక్కియకు ఫిర్యాదు చేశారు. అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ చాలా సార్లు అధికారులను కలసి సమస్యను వివరించామన్నారు. అయినా పంచాయతీ కార్యదర్శి విధానంలో మార్పు రాలేదన్నారు. తిరిగి జేసీని కలసి వినతి పత్రం అందించామని శ్రీనివాస్ వివరించారు. ఆక్రమణదారుల నుంచి బెదిరింపులు వస్తున్నాయని తన కుటుంబానికి రక్షణ కల్పించాలని కోరినట్లు తెలిపారు.

ఇక నడక... చకచకా

- అందుబాటులోకి సైక్లింగ్, వాకింగ్ ట్రాక్
- శశికాంత్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి రూ.1.90 కోట్లతో పనులు



వాకింగ్, సైక్లింగ్ ట్రాక్ నిర్మాణ పనులు చేస్తున్న కూలీలు

కాకినాడ రూరల్: ఇక నడక చకచకా సాగనుంది.. సైక్లింగ్ సాఫీగా జరుగనుంది. దీనికిగాను కాకినాడలోనే బెస్ట్ సైక్లింగ్ ట్రాక్ రూరల్ నియోజకవర్గ పరిధి రెండో డివిజన్‌లో రూపుదిద్దుకుంటోంది. శశికాంత్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి వలసపాకల రోడ్డును ఆనుకుని దీని నిర్మాణం జరుగుతోంది. సుమారు కిలోమీటరు మేర సైక్లింగ్‌కు ట్రాక్ పనులతో పాటు నడక బాట పట్టేవారి కోసం వాకింగ్ ట్రాక్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కాకినాడతో పాటు గతంలో నగరంలో విలీనమైన గ్రామీణ ప్రాంతాలు ఇప్పుడు అభివృద్ధి వైపు పయనిస్తున్నాయి. కార్పొరేషన్ పరిధిలో ప్రధానంగా కాకినాడ అసెంబ్లీ స్థానం ఉండగా 8 డివిజన్లు రూరల్ నియోజకవర్గ పరిధిలో ఉన్నాయి. ఆయా డివిజన్లకు ప్రతినిధ్యం వహిస్తున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అభివృద్ధి మంత్రం పఠిస్తూ కార్పొరేషన్ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టేలా చూస్తున్నారు. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాన్ని తలపించే వలసపాకల జంక్షన్ నుంచి ఆర్టీఓ కార్యాలయం మార్గంలో అభివృద్ధి పనులు జోరందుకున్నాయి. రోడ్డు పొడవునా ఆక్రమణలతో వెలసిన గుడిసెలు, పక్కనే తుప్పలతోనే నిండిన మురుగు కాలువ, దోమలకు ఆవాసంగా ఉండే ఈ ప్రాంతం ఇప్పుడు సుందరంగా మారుతుంది.

మరో నెల రోజుల్లోనే..

గత ఏడాది జూన్‌లో ఎమ్మెల్యే కురసాల కన్నబాబు, ఎంపీ వంగా గీత, అప్పటి మేయర్ సుంకర శివప్రసన్న తదితరులు సుమారు రూ.1.90 కోట్లతో రోడ్డున ఆనుకుని పక్కా సీసీ డ్రైనేజీతో పాటు సైక్లింగ్ ట్రాక్, వాకింగ్ ట్రాక్, పచ్చని మొక్కలతో గ్రీనరీ అభివృద్ధికి శంకుస్థాపన చేశారు. అంతటితో విడిచిపెట్టని ఎమ్మెల్యే కన్నబాబు తరచూ కార్పొరేషన్ అధికారులతో సమీక్షిస్తుండడంతో పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. మరో నెల రోజుల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉన్నట్టు ఇంజినీరింగ్ అధికారులు చెబుతున్నారు.

అభివృద్ధిని చూసి ఆనందం

రోడ్డు పక్కన మురుగు కాలువ, అక్కడే ఆక్రమణల్లో గుడిసెలు, తుప్పలతో ఇబ్బందికర వాతావరణాన్ని చవిచేసిన ఆ ప్రాంత ప్రజలు ఇప్పుడు తమ కంటి ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు వాకింగ్ ట్రాక్, సైక్లింగ్ అందుబాటులోకి రానుండడంతో శశికాంత్ నగర్‌లో ఇళ్ల అద్దెలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. నెలకు రూ.7 వేల వరకూ ఉండే అద్దెలు ఇప్పుడు రూ.10 వేలకు మించి ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. మరోవైపు స్థలాలు విలువ అమాంతం పెరిగింది.

చురుగ్గా పనులు



కాకినాడ శశికాంత్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి వలసపాకల రోడ్డును ఆనుకుని నిర్మిస్తున్న సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు, గ్రీనరీ కోసం పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నెల రోజుల్లో పూర్తయ్యే అవకాశం ఉంది. కార్పొరేషన్ సాధారణ నిధులు రూ.1.90 కోట్లతో పనులు జరుగుతున్నాయి. ఇది కాకినాడలో బెస్ట్ సైకిలింగ్ ట్రాక్ అవుతుంది. 8 అడుగులు వెడల్పు మేర ట్రాక్‌లో పక్కపక్కనే రెండు సైకిళ్లు వెళ్లే వీలుంటుంది. ట్రాఫిక్ సమస్య ఉండదు కనుక సైక్లింగ్‌కు అనుకూలంగా ఉంటుంది.

–రమేష్‌బాబు,
నగరపాలక సంస్థ ఏఈ, కాకినాడ

నేడు శోభనాద్రి సత్రం వ్యవస్థాపక దినోత్సవం

బోట్‌క్లబ్: స్థానిక పెద్ద మార్కెట్‌లో బంగారుచిన శోభనాద్రి సత్రం వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు సత్రం ఈఓ అడబాల శ్రీను సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు నిరు పేదలకు వస్త్ర, అన్నదానం ఉంటుందన్నారు. దీనికి దేవదాయ శాఖ రీజినల్ జాయింట్ కమిషనర్ ఎం.సురేష్‌బాబు, డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు, జిల్లా దేవదాయశాఖ అధికారి పులి నారాయణమూర్తి పాల్గొంటారన్నారు.

గురజనాపల్లిలో ఆధార్ సేవలు

కరప: గురజనాపల్లి సచివాలయంలో సోమవారం మండల అధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక మొబైలు ఆధార్ కేంద్రాన్ని నిర్వహించినట్లు గ్రామ కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ తెలిపారు. మొత్తం 31 మంది గ్రామస్తులు సేవలను వినియోగించుకున్నారు. డిజిటల్ అసిస్టెంట్ సూరాడ అబ్బాయి, వెల్ఫేర్ అసిస్టెంట్ కె.కాంచనమాల తదితర సిబ్బంది సేవలు అందించారన్నారు.

మరిన్ని సేవలకు కృషి



వీరభద్రారెడ్డి పుట్టినరోజు వేడుకల్లో సుంకర శివప్రసన్న తదితరులు

కాకినాడ: రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘ అధ్యక్షుడు, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం స్థానిక త్రిపురసుందరి ఆలయ సమీపంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, కార్మిక సంఘాల ప్రతినిధుల సమక్షంలో కేక్ కట్ చేశారు. పార్టీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి మాట్లాడుతూ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల ఆదరాభిమానాలు చూరగొన్న వీరభద్రారెడ్డి రానున్న రోజుల్లో మరిన్ని సేవలు అందించాలని ఆకాంక్షించారు. ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరభద్రారెడ్డి మాట్లాడుతూ సేవా కార్యక్రమాల విస్తరణకు వంతు కృషి చేస్తానన్నారు. అనంతరం ఆయన్ని ఘనంగా సత్కరించారు. లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీరభద్రారెడ్డి, ద్వారంపూడి చారిటబుల్ ట్రస్ట్ ఆర్గనైజర్ కర్రి వీర్రెడ్డి (చినబాబు), రాష్ట్ర వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, మాజీ డిప్యూటీ మేయర్ పసుపులేటి వెంకటలక్ష్మి, నాయకులు సుంకర విద్యాసాగర్ పాల్గొన్నారు.

స్వచ్ఛ పల్లెలను సాధిద్దాం..

- వర్మీకంపోస్టు తయారీకి ప్రాధాన్యం
- జిల్లా పంచాయతీ అధికారి విక్టర్



సర్పంచ్ ఆశాజ్యోతి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావుతో కలసి మొక్కను నాటుతున్న డీపీఓ విక్టర్

కరప: సమష్టి కృషితో స్వచ్ఛ పల్లెలను సాధిద్దామని, దీనికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి ఆర్.విక్టర్ తెలిపారు. సోమవారం ఆయన కరపలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో చాలాచోట్ల చెత్త సమస్య ఉందన్నారు. సిబ్బంది పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించి, వీధులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. క్లాప్‌మిత్ర విజిల్ వేసుకుంటూ ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలన్నారు. వీధులు, ఇళ్ల నుంచి సేకరించిన చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రానికి తరలించి అక్కడ మళ్లీ దేనికది విడదీసి, పేడ, కొబ్బరి డొక్కలు, వానపాములతో వర్మీకంపోస్టు తయారు చేస్తే పంచాయతీలకు ఆదాయం సమకూరుతుందని అన్నారు. గతంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేయించేందుకు, బహిరంగ మలవిసర్జన నిర్మూలించేందుకు ఎలాగైతే పోరాటం చేసి విజయం సాధించామో అలాగే బహిరంగంగా చెత్త వేయకుండా డస్ట్ బిన్‌లలో వేసేలా ప్రజలకు అవగాహన కల్పించాలని విక్టర్ వివరించారు. గ్రామాలను శుభ్రంగా ఉంచడమే కాకుండా మొక్కలు నాటి పర్యావరణ హితానికి పాటుపడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించేలా ప్రజల్లో చైతన్యం నింపాలన్నారు. పగలు వీధిదీపాలు వెలగకుండా చూడాలన్నారు. కరపలోని ప్రధాన రహదారికి ఇరువైపులా చెత్త లేకుండా చర్యలు తీసుకోవడం, ఎస్‌డబ్ల్యూపీసీ యూనిట్ పరిశుభ్రంగా సక్రమంగా నిర్వహించడంపై సర్పంచ్, పంచాయతీ సిబ్బంది పనితీరుపై డీపీఓ సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం క్లాప్‌మిత్ర మందనక్క కాంతారావును డీపీఓ సత్కరించారు. సర్పంచ్ సాదే ఆశాజ్యోతి, సిబ్బందితో కలసి డీపీఓ విక్టర్ మొక్కలను నాటారు. వైఎస్సార్ సీపీ నాయకుడు సాదే లోహిదాస్‌కుమార్, ఈఓపీఆర్డీ ఎస్‌వీ శ్రీనివాసరావు, కరప, అరట్లకట్ట గ్రామ కార్యదర్శులు వి.సునీల్‌కుమార్, రాంజీ హీరాలాల్, ఎఫ్‌టీసీ పి.రామకృష్ణ, కె.కేశవరావు, సచివాలయ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మా.. పాహిమాం



ఉత్సవాలకు ముస్తాబైన టూ టౌన్ నూకాలమ్మ అమ్మవారి ఆలయం

కొత్త అమావాస్య ఉత్సవాలకు సిద్ధం



నూకాలమ్మ అమ్మవారికి పూజలు చేస్తున్న దేవదాయశాఖ డీసీ విజయరాజు

బోట్‌క్లబ్: నూకాలమ్మ అమ్మవారి వేడుకకు వేళయ్యింది.. కొత్త అమావాస్యను పురస్కరించుకుని మంగళవారం కాకినాడ నగరంలోని పలు అమ్మవారి ఆలయాల్లో వేడుకల నిర్వహణకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఆలయాలను సర్వాంగ సుందంగా తీర్చిదిద్దారు. కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరొందిన స్థానిక టూ టౌన్ నూకాలమ్మ తల్లి ఆలయంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ లక్ష్మణరావు తెలిపారు. సోమవారం ఆలయంలో భజన కార్యక్రమం జరిగింది. మంగళవారం పెద్ద జాగారం నిర్వహించనున్నారు. తెల్లవార్లూ జాతర మహోత్సవం జరుగుతుంది. అమ్మవారి గరగల నృత్యం, బ్యాండు మేళం, కొమ్ము డ్యాన్స్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నాయి. 22న ఉగాది సందర్భంగా జాతర మహోత్సవం, రాత్రి సిరిబొమ్మ ఉత్సవం నిర్వహించనట్లు ఈఓ చెప్పారు. 24న అమ్మవారి బుక్కా సంబరం ఉంటుందన్నారు. స్థానిక పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ ఆలయంలో ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ తారకేశ్వరరావు తెలిపారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా భారీ క్యూలైన్లు ఏర్పాటు చేశామన్నారు. మంగళవారం ఆలయంలో సిరిబొమ్మ ఉత్సవం నిర్వహిస్తామన్నారు.

భక్తులకు సదుపాయాలు కల్పించాలి

బోట్‌క్లబ్: కొత్త అమావాస్య, ఉగాది సందర్భంగా నూకాలమ్మ అమ్మవారి ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ మేడేపల్లి విజయరాజు ఆదేశించారు. స్థానిక పెద్ద మార్కెట్‌లోని నూకాలమ్మ అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. నెల రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు వేలాది సంఖ్యలో భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆలయ ఈఓ తారకేశ్వరావుకు సూచించారు. క్యూలైన్‌లో తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా దేవదాయశాఖ అధికారి పులి నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

‘స్పందన’తో సమస్యల సత్వర పరిష్కారం



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కమిషనర్ రమేష్

కాకినాడ: ప్రజలు ఎదుర్కొనే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలనే లక్ష్యంతో ప్రభుత్వం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం స్పందన జరిగింది. ప్రజల నుంచి వచ్చిన వినతులను కమిషనర్ స్వీకరించారు. అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావుతో పాటు పలువురు అధికారులు హాజరయ్యారు. వచ్చిన వినతులను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదుకు నాణ్యమైన పరిష్కారాన్ని అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. కార్పొరేషన్‌కు సంబంధించిన వివిధ సమస్యలను ప్రజలు కలెక్టరేట్ దృష్టికి కూడా తీసుకువెళ్లారని, వాటిని పరిశీలించి వేగంగా పరిష్కరించాలని సూచించారు. మేనేజర్ కర్రి సత్యనారాయణ, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి ఉచిత నాట్య శిబిరం

కాకినాడ కల్చరల్: ఉగాదిని పురస్కరించుకుని 22న ఉదయం బాల బాలికలకు ఉచిత నాట్య శిబిరం ప్రారంభిస్తున్నట్లు శ్రీబాలాత్రిపుర సుందరీ నృత్యనికేతన్ (కాకినాడ) నాట్యాచార్య బేతా సత్యనారాయణ సోమవారం తెలిపారు. ప్రతిభగల పేద బాల బాలికలను గుర్తించి వీరికి నాట్యంలో ఉచితంగా శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా సామర్లకోట శ్రీచాళుక్య కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో నాట్య శిబిరం ఏర్పాటు చేశామన్నారు. 8 నుంచి 16 ఏళ్ల వయసు కలిగిన విద్యార్థులు అర్హులన్నారు. ప్రతి ఆదివారం సాయంత్రం 4 నుంచి 6 గంటల వరకూ నాట్యంలో ఉచిత శిక్షణ ఇస్తామని తెలిపారు. మరిన్ని వివరాలకు 94415 63253 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

నిధులు కేటాయించాలి

కాకినాడ సిటీ: చేతి వృత్తిదారులకు రూ.50 వేల కోట్ల నిధులు కేటాయించాలని, వృత్తిదారుల రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ ధర్నా చౌక్ వద్ద నిరసన తెలిపారు. చేతివృత్తిదారుల రాష్ట్ర నాయకుడు ఎం.భాస్కరయ్య, సీపీఎం జిల్లా కన్వీనర్ మోర్త రాజశేఖర్, కన్వీనర్ చింతపల్లి అజయ్‌కుమార్, నాయకులు కోనేటి రాజు, చెక్కా రమణి, బత్తిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సమర్థంగా కమాండ్ కంట్రోల్ సెంటర్



కమాండ్ కంట్రోల్ సెంటర్ గురించి సమీక్షిస్తున్న రమేష్

కాకినాడ: ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ మరింత సమర్థవంతంగా పనిచేసేలా చర్యలు తీసుకోనున్నట్టు కాకినాడ స్మార్ట్ సిటీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్, కార్పొరేషన్ కమిషనర్ కె.రమేష్ చెప్పారు. సోమవారం సాయంత్రం కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్వహణపై స్మార్ట్ సిటీ కార్యాలయంలో అధికారులు, వివిధ ఏజెన్సీలతో ఆయన సమావేశమయ్యారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఈ సెంటర్ పూర్తిస్థాయిలో వినియోగంలోకి వచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అభిప్రాయాలు తీసుకున్నారు. ఐసీసీసీని స్వయం సమృద్ధితో నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు స్వీకరించి వాటిని వచ్చే స్మార్ట్‌సిటీ బోర్డు సమావేశం అజెండాలోకి తీసుకురావాలని నిర్ణయించారు. స్మార్ట్‌సిటీ కార్పొరేషన్ చైర్మన్, కలెక్టర్ కృతికాశుక్లా సమక్షంలో జరిగే బోర్డు సమావేశంలో తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. స్మార్ట్‌సిటీ ఎస్ఈ వెంకట్రావు, ఆయా ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

హైందవ సిద్ధాంత గొప్పతనాన్ని తెలుసుకోవాలి



క్యాలెండర్‌ను పరిశీలిస్తున్న చాగంటి కోటేశ్వరరావు

కాకినాడ రూరల్: ప్రతి ఒక్కరూ పాశ్చాత్య పోకడలకు పోకుండా హైందవ సిద్ధాంత గొప్పతనాన్ని తెలుసుకోవాలని ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు అన్నారు. హైదరాబాద్‌కు చెందిన ‘శ్రీ తత్త్వమసి’ విద్యా వైద్య ఆధ్యాత్మిక సేవా సంస్థకు చెందిన క్యాలెండర్ ఆవిష్కరణ సోమవారం జరిగింది. ఈదల శివశంకర్ ఆదేశాలతో సంస్థ అధ్యక్షుడు సుదర్శనం సత్యసాయి సూచనలతో తిమ్మాపురంలోని గోశాలలో సంస్థ కార్యదర్శి ప్రసాదరావు గురుస్వామి ఆధ్వర్యంలో చాగంటి కోటేశ్వరరావు చేతుల మీదుగా తెలుగు సంవత్సరాది క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు రగిలించిన స్ఫూర్తికి తామంతా చేయూతనిస్తున్నామని తెలిపారు. తెలుగు సంవత్సరాది గొప్పతనాన్ని తెలియజెప్పే విధంగా తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. సేవా సంస్థ ట్రెజరర్ మల్లిఖార్జునశర్మ, జాయింట్ సెక్రటరీ రామ్మోహన్ గురుస్వామి, వేలు గురుస్వామి, చక్రధర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా

కాకినాడ సిటీ: కనీస వేతనం ఇవ్వాలంటూ చలో విజయవాడకు బయలుదేరిన అంగన్‌వాడీ సిబ్బందిని పోలీసులు అరెస్టు చేయడం సరికాదని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సోమవారం స్థానిక కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. తొలుత సుందరయ్యభవన్ నుంచి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. సీఐటీయూ జిల్లా నాయకుడు దువ్వా శేషుబాబ్జీ, చెక్కల రాజ్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ మహిళలపై దుర్భాషలాడిన సామర్లకోట సీఐ దుర్గాప్రసాద్‌పై చర్యలు తీసుకోవాలన్నారు.

జాతి నిర్మాణంలో యువతదే కీలక పాత్ర



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ ప్రసాదరాజు

కాకినాడ రూరల్: తిమ్మాపురంలోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఎంఎస్ఎన్ క్యాంపస్‌లో నెహ్రూ యువ కేంద్రం కాకినాడ, రాజనీతి, ప్రభుత్వ పాలనాశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో యూత్ పార్లమెంట్ సోమవారం జరిగింది. దీనికి ప్రిన్సిపల్ డాక్టర్ కె.కమలకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపకులపతి ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు మాట్లాడుతూ జాతి నిర్మాణంలో యువతదే కీలక పాత్ర అని అన్నారు. యూత్ పార్లమెంట్‌లతో విద్యార్థుల్లో ఆలోచనా సామర్థ్యాలను పెంపొందించవచ్చన్నారు. ఇటీవల మృతి చెందిన విభాగ సహాయ ఆచార్యుడు డాక్టర్ మద్దా సత్యనారాయణ లేనిలోటు స్పష్టంగా కనిపిస్తుందని కమలకుమారి అన్నారు. కార్యక్రమ ఉద్దేశాన్ని కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ కె.జోసెఫ్ స్టీఫెన్, నెహ్రూ కేంద్రం జిల్లా అధికారి పి.అమృతేష్ తెలిపారు. జిల్లా ఇండస్ట్రియల్ ప్రమోషన్ ఆఫీసర్ కె.కృష్ణార్జునరావు, కాకినాడ బార్ కౌన్సిల్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలూరి సుబ్రహ్మణ్యం, ప్రొఫెసర్ ప్రశాంతి శ్రీ, డాక్టర్ కె.హరిబాబు, డాక్టర్ ఎం.గోపి, డాక్టర్ పి.రాజ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి ప్రాధాన్యం



ఆసిఫ్ అలీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న అబ్దుల్ బషీరుద్దీన్, రెహమాన్‌ఖాన్ తదితరులు

కాకినాడ: రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర ముస్లిం మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఆసిఫ్ అలీ అన్నారు. సోమవారం కాకినాడలోని జిల్లా మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. తొలుత ఆయనకు కార్పొరేషన్ ఈడీ సునీల్‌కుమార్ పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. అలీని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ డైరెక్టర్ అబ్దుల్ బషీరుద్దీన్, కాకినాడ జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ రెహమాన్‌ఖాన్, జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి కరీం బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ జాఫర్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆసిఫ్ అలీ మాట్లాడుతూ ముస్లిం మైనార్టీ కార్పొరేషన్ ద్వారా మైనారిటీలకు రుణాలు ఇచ్చే అంశంపై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పరిశీలిస్తున్నారన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి ఇమ్రాన్, వైఎస్సార్ సీపీ నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు ఖాలిద్ బిన్ వలీ, నాయకులు జాఫర్ తదితరులు పాల్గొన్నారు.